సాక్షి
చిత్తూరు
ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



సరస్వతీ యాగానికి ఏర్పాట్లు

కాణిపాక ఆలయంలో ఈనెల 3న సరస్వతీ యాగానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. - IIలో



కల్లూరు బడికి హరిత పురస్కారం

కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్ జాతీయ స్థాయి హరిత పురస్కారానికి ఎంపికైంది. - IIలో



కొండచిలువ కలకలం

కార్వేటినగర సమీపంలో భారీ కొండచిలువ జనారణ్యంలోకి రావడంతో కలకలం రేగింది. - IIలో

న్యూస్‌రీల్

రాజకీయంగా ఎదుర్కోలేక విమర్శలు

• ఎమ్మెల్సీ భరత్



భరత్, ఎమ్మెల్సీ

శాంతిపురం : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులను రాజకీయంగా ఎదుర్కోలేక కూటమి నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆ పార్టీ ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ పేర్కొన్నారు. అధికార పక్షం కుట్ర పూరితంగా చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని ఖండించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యతను పక్కన పెట్టి డైవర్షన్ పాలిటిక్స్‌తోనే కాలం గడుపుతున్నారని విమర్శించారు. సీఎంకు చిరకాల రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న పెద్దిరెడ్డిపై తప్పుడు విమర్శలు చేయిస్తున్నారని అన్నారు. భూ కబ్జా విమర్శలు కూడా ఈ కోవకు చెందినవేనన్నారు. సూపర్ సిక్స్ అమలు కాక, కొత్త ప్రభుత్వం వచ్చాక గతంలో ఉన్న ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు కాక జనం తల్లడిల్లిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

'ప్రభుత్వ'బడిలో పార్టీ సమా'వేషాలా'!



ప్రకాష్ రెడ్డి

సదుం : ప్రభుత్వ పాఠశాలలో రాజకీయ సమావేశాలకు వీల్లేదని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ సోమల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 2న నిర్వహించే జనసేన సమావేశానికి ఎలా అనుమతి ఇచ్చిందని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నాగబాబు హాజరయ్యే ఈ సమావేశానికి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారని, ప్రభుత్వ ఉత్తర్వులు జనసేనకు వర్తించవా.. అని ఆయన ప్రశ్నించా రు. దీనికి అధికారులు సమాధానం చెప్పాలని డిమాండు చేశారు.

అటవీ సరిహద్దులు పక్కాగా ఉండాలి



భూముల వివరాలు తెలుసుకుంటున్న ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి సాంకేత్‌గరుడ్

గుడిపాల : అటవీ సరిహద్దులు పక్కాగా ఉండే విధంగా చూసుకోవాలని ఇండియన్ ఫారెస్ట్ సెక్షన్ ట్రైనీ (ఐఎఫ్ఎస్) అధికారి సాంకేత్ గరుడ్ అన్నారు. శనివారం ఆయన పాపసముద్రం పంచాయతీలో పారెస్ట్ , రెవెన్యూ సరిహద్దులు పరిశీలించారు. అలాగే బంగారక్క చెరువులో చెరువు , రెవెన్యూ భూముల సరిహద్దులు వాటి వివరాల గురించి సర్వేయర్‌లను అడిగి తెలుసుకున్నారు. గుడిపాల మండలంలో రీసర్వే ఎలా జరుగుతుందనే అంశాలపై రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రూపారాణిని అడిగి తెలుసుకున్నారు. గుడిపాల మండలంలో అటవీశాఖ భూములు , రెవెన్యూ , ఇరిగేషన్‌కు సంబంధించిన భూములు ఎంత ఉన్నాయి అనే వాటిపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మిదేవి, సర్వేయర్ గోపినాథ్, కమ్యూనిటీ సర్వేయర్ కోటీశ్వర రావు, గ్రామ సర్వేయర్‌లు భానుప్రతాప్, ప్రకాష్, సంపత్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల హామీలు నెరవేర్చాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్

వి.కోట : ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని , వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీల మేరకు జీతాలు పెంచి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షుడు కోదండయ్య, జిల్లా అధ్యక్షుడు ప్రభావతి, నాయకులు సుజాత, జోతి, కార్యకర్తలు హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం బరితెగించింది. నిబంధనలను తుంగలో తొక్కింది. తిరుపతి కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ పదవి కోసం విధ్వంసానికి పాల్పడింది. బలం లేకపోయినా బరిలో నిలిచేందుకు కుయుక్తులు పన్నింది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను భయభ్రాంతులకు గురిచేసింది. ఆస్తులను ధ్వంసం చేస్తూ తమవైపు తిప్పుకునేందుకు పన్నాగం పన్నింది. నగర ప్రథమ పౌరురాలిపై అమానవీయంగా ప్రవర్తించి అగౌరవపరిచింది. ఇంత జరుగుతున్నా అధికారయంత్రాంగం చూస్తూ ఉండిపోవడం.. కూటమి నేతలకే వత్తాసు పలకడం విస్మయానికి గురిచేసింది.

బలం లేక బరితెగింపు!



నిరసన వ్యక్తం చేస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష, కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆస్తుల విధ్వంసం

- నోటీసులు ఇవ్వకుండా అక్రమం అంటూ కూల్చివేతలు
- సాక్షాత్తు నగర ప్రథమ పౌరురాలు చెబుతున్నా వినకుండా దౌర్జన్యం
- కూల్చివేతలను అడ్డుకునేందుకు యత్నించిన వారి గొంతు నొక్కిన అధికారులు
- మహిళలను అడ్డుకునేందుకు మహిళా పోలీసులు లేరా?
- ఆధ్యాత్మిక నగరంలో డెప్యూటీ మేయర్ కోసం అధికార అరాచకం







గొంతు పట్టుకుని ఈడ్చిపడేస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకానికి అడ్డేలేకుండా పోతోంది. బలం లేకపోయినా బరితెగింపునకు దిగింది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను భయపెట్టి డెప్యూటీ మేయర్ పీఠాన్ని కైవశం చేసుకునేందుకు ఆస్తుల విధ్వంసానికి తెరదీసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ.. అధికారులు అధికార పార్టీ నేతల అండతో రెచ్చిపోవడం.. మేయర్ డాక్టర్ శిరీష చెబుతున్నా వినకుండా ఆమె పట్ల అమానవీయంగా ప్రవర్తించడం విమర్శలకు తావిస్తోంది.

బలం లేకపోయినా..

తిరుపతి కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ ఉప ఎన్నిక ఈనెల 3న జరగనుంది. ఈ ఎన్నిక కోసం వైఎస్సార్ సీపీ తరఫున డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డిని బరిలోకి దింపారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 50 డివిజన్లలో 48 వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపొందినా.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పార్టీ నేతలు కొందరు కార్పొరేటర్లను భయపెట్టి లాక్కున్నారు. అలా 9 మంది కార్పొరేటర్లు వారివైపు ఉన్నా.. మిగిలిన 39 మంది కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీ వారే. ఏ రకంగా చూసినా తిరిగి డెప్యూటీ మేయర్ పదవి వైఎస్సార్‌సీపీకే దక్కాలి.

కుట్రలు..ఒత్తిళ్లు

ఒకే ఒక్క డివిజన్‌ని గెలుసుకున్న టీడీపీ మరికొందరు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో డెప్యూటీ మేయర్ పదవిని లాక్కునేందుకు అరాచకాలకు దిగింది. శేఖర్‌రెడ్డిని పోటీ నుంచి తప్పుకోవాలని, వారి కుటుంబ సభ్యులకు ఫోన్లు చేసి తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు చేశారు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి కూటమి నేతలు పోలీసులు, కార్పొరేషన్, రెవెన్యూ అధికారులను రంగంలోకి దింపి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆస్తుల విధ్వంసానికి తెరదీశారు. కూటమి నేతలు అధికారాన్నంతా ఉపయోగించి వైఎస్సార్‌సీపీ డెప్యూటీ మేయర్ అభ్యర్థి శేఖర్‌రెడ్డిని శనివారం రాత్రి తమవైపు తిప్పుకున్నారు.

ఈడ్చిపడేశారు

నగర ప్రథమ పౌరురాలు డాక్టర్ శిరీష, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, మహిళా నాయకురాళ్లని ఈడ్చిపడేశారు. పత్రికలో రాయలేని పదాలతో తిట్ల పురాణం అందుకున్నారు. పోలీసులు చుట్టుముట్టి నెట్టుకుంటూ భూమన అభినయ్‌రెడ్డిని బయటకు లాగి పడేశారు. పోలీసులు విచక్షణ కోల్పోయి వ్యవహరించిన తీరు విస్మయానికి గురిచేసింది. మహిళ పట్ల మగ పోలీసులు వ్యవహరించిన తీరుపై పార్టీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఇంత దుర్మార్గమా బాబూ!

తిరుపతి మంగళం: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో కూటమి ప్రభుత్వంలోని పాలకులు అరాచకం సృష్టించారు. డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఎలాగైనా గెలవడానికి అనైతికంగా అధికారులను అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి మండిపడ్డారు. తిరుపతిలోని తన నివాసంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో ఇంత దుర్మార్గమా..? ప్రభుత్వ అధికారులు కూటమి ప్రభుత్వానికి బానిసలుగా పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

అభ్యర్థిగా ప్రకటించిన శేఖర్‌రెడ్డిని, అతని కుటుంబాన్ని భయపెట్టి లొంగదీసుకోవడం సిగ్గుచేటన్నారు. తమ పార్టీ నాయకులు గఫూర్, లక్ష్మణ్ ఇళ్లను కూడా కూల్చివేశారన్నారు.

డెప్యూటీ మేయర్ అభ్యర్థిగా లడ్డూ భాస్కర్‌రెడ్డి

శేఖర్‌రెడ్డి పోటీ నుంచి తప్పుకుంటే తిరుపతి 47వ డివిజన్ కార్పొరేటర్ లడ్డూ భాస్కర్ రెడ్డిని డెప్యూటీ మేయర్ అభ్యర్థిగా తాము నిలబెడుతున్నామని ప్రకటించారు. సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, కార్పొరేటర్లు లడ్డూ భాస్కర్‌రెడ్డి, ఆదం రాధాకృష్ణారెడ్డి, తమ్ముడు గణేష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా రుణాల మంజూరు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

• కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో స్వయం ఉపాధి రుణాల మంజూరు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, బీసీ, మైనారిటీలకు మెరుగైన జీవనోపాధుల కల్పనకు స్వయం ఉపాధి రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రుణాల మంజూరులో బ్యాంకర్‌లు ఎలాంటి ఇబ్బందులు సృష్టించకూడదన్నారు. బీసీ కార్పొరేషన్‌లో అర్హత ఉన్న ఈబీసీ, కమ్మ, రెడ్డి, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాల వారికి 50 శాతం సబ్సిడీ కింద రుణాలు మంజూరు చేస్తారన్నారు. బీసీ కార్పొరేషన్‌లో 2,800 యూనిట్లకు సబ్సిడీలో రూ.61.25 కోట్లు రుణాలు, మైనారిటీ కార్పొరేషన్లలో 916 క్రిస్టియన్, ముస్లిం మైనారిటీలకు రూ.14 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు అర్హత ఉన్న వారు ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, మైనారిటీ శాఖ ఈడీ హరినాథ రెడ్డి, ఎల్‌డీఎం హరీష్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పురోగతిలో అలసత్వం వద్దు

జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. ఈ మేరకు హౌసింగ్ శాఖ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న మూడు నెలల్లో యుద్ధ ప్రాతిపదికన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాల పురోగతిపై ఈనెల 5న చిత్తూరు, నగరి నియోజకవర్గాలు, 6న పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమీక్షలో హౌసింగ్ పీడీ గోపాల్‌నాయక్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నాడు భరోసా.. నేడు బారులు

- యూరియాకు రైతుల పడిగాపులు
- గంటల తరబడి నిరీక్షణ.. తోపులాట
- కిలోమీటరు వరకు బారులు తీరిన రైతులు
- పెనుమూరులో యూరియా కొరత



ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

పెనుమూరు (కార్వేటినగరం) : యూరియా కొరత గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని అన్నదాతలను కంటతడి పెట్టిస్తోంది. ఆరు మండలాల్లో పెనుమూరు మండలంలో తప్ప ఐదు మండలాల్లో యూరియా నిల్వలు లేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. పంట సాగు చేసిన రైతులు వాటిని రక్షించుకునేందుకు ఎరువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి వెతలు పడుతున్నారు. పెనుమూరు మండలంలో ఎరువుల విక్రయ కేంద్రం వద్ద రైతుల అవస్థలు వర్ణనాతీతంగా మారింది. శనివారం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ఎరువుల కోసం పెద్ద ఎత్తున తరలిరావడంతో కిలో మీటరు మేర రైతులు గంటల తరబడి రోడ్డుపై బారులు తీరారు. అయినప్పటికీ రైతులు అధిక సంఖ్యలో వస్తుండడంతో తోపులాట చోటుచేసుకుంది. కొందరు రైతులు తోపులాటలో కిందపడ్డారు. అక్కడ పరిస్థితి తీవ్రం కావడంతో గుర్తించిన అధికారులు అదుపు చేసేందుకు విఫలయత్నం చేశారు. దీంతో చేసేది లేక జిల్లా అధికారులకు సమాచారం అందించారు. వెంటనే పెనుమూరు పోలీసులు రంగ ప్రవేశం చేసి అదుపు చేసేందుకు ప్రయత్నించగా రైతులు కోపోద్రిక్తులై కూటమి ప్రభుత్వంపై అక్కసును వెళ్లగక్కారు. అధికారుల నిర్లక్ష్యంపై నిప్పులు చెరిగారు. ఇదే అదునుగా మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను యజమానులు మూసివేశారు. యూరియా కొరత కారణంగా రైతుల అవసరాలను పసిగట్టిన దుకాణాదారులు అధిక ధరలకు విక్రయించేందుకు దుకాణాలు మూసి వెళ్లిపోవడంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు తిండిలేక ఎండలో అలమటించారు. సుమారు వెయ్యి మంది రైతులు రావడంతో కనీసం వారికి తాగునీరు కూడా లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఏ సీజన్‌లో అయినా రైతులకు ఎలాంటి కొరత లేకుండా అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచి పంపిణీ చేసే వారని రైతులు చర్చించుకోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ఇదే అదునుగా భావించిన కొందరు అధిక ధరలకు ఎరువులను విక్రయించి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యూరియా తెప్పిస్తాం ఆందోళనపడొద్దు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలోని రైతులు యూరియా లేదని ఆందోళన పడొద్దని యూరియా తెప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా యూరియా దాదాపు 2500 మెట్రిక్ టన్నులు ఉన్నాయన్నారు. స్పిక్ 250 మెట్రిక్ టన్నులు, కోరమాండల్ యూరియా దాదాపు 400 మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చిందన్నారు. మళ్లీ యూరియా తెప్పించే విధంగా చూస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూరియాను పశు గ్రాసం పెంపకానికి వాడొద్దని సూచించారు.

ఆశలు..నిరాశే !

కేంద్ర మంత్రి నిర్మలమ్మ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించింది. జిల్లాలో పారిశ్రామిక హబ్ ప్రస్తావన కనిపించలేదు.. కొత్త రైల్వే ప్రాజెక్టుల ఊసేలేదు. చిత్తూరులో కనీసం సూపర్ ఫాస్ట్ రైళ్ల స్టాపింగ్‌పై కూడా కనికరం చూపలేదు. జిల్లాలో అధికంగా సాగవుతున్న మామిడి బోర్డు ప్రతిపాదన అటకెక్కించారు. కేంద్రీయ విద్యాసంస్థల ఆశలపై నీళ్లు చల్లారు. ఇలా కేంద్ర బడ్జెట్‌లో చిత్తూరు జిల్లాకు అన్ని విధాల మొండిచేయి ఎదురైంది. జిల్లాకు మేలు కలుగుతుందని ఆశించిన ప్రజానికానికి ఈ బడ్జెట్ నిరుత్సాహ పరిచింది. కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఒరిగిందేమి లేదని విశ్లేషకులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

- కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు రిక్తహస్తం
- వేతన జీవులకు మొండిచేయి
- బడ్జెట్‌పై పెదవి విరుస్తున్న నిపుణులు
- జిల్లాకు కలిసిరాని నిర్మలమ్మ పద్దు



చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చిత్తూరు జిల్లాకు ఒరిగిందేమి లేదని, ప్రధానంగా వేతన జీవులకు ఈ బడ్జెట్ ఎంతో నిరాశను కలిగించిందని జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు. బడ్జెట్‌లో జిల్లాకు ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో జిల్లా వాసుల ఆశలను అడియాసలు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 67,840 మంది ఉద్యోగులకు ఎలాంటి మేలు చేకూర్చలేదని వాపోతున్నారు.

ప్రజల ఆశలను అడియాసలు చేసింది



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రజల ఆశలను అడియాసలు చేసింది. ఏపీకి మళ్లీ మొండి చేయి చూపించింది. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కన పెట్టింది. విభజన చట్టం ప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యా సంస్థలకు కేటాయింపులు చేయలేదు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అన్ని పార్టీల ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలి.

– వాడ గంగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి చిత్తూరు జిల్లా

మామిడి బోర్డు ఊసేలేదు



జిల్లాకు మామిడి బోర్డు విషయమై రాష్ట్ర ప్రభుత్వం, చిత్తూరు ఎంపీ హామీలు నీటి మూటలాగా మారింది. సహకార చక్కెర ఫ్యాక్టరీలను పునః ప్రారంభించేందుకు ఎలాంటి సహకారం కేంద్రం ఇవ్వకపోవడం శోచనీయం. దేశంలో అత్యధికంగా ఉన్న రైతాంగ ప్రయోజనాలకు బడ్జెట్ ఏ మాత్రం అనుకూలంగా లేదు. కిసాన్ క్రెడిట్ కార్డులు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతామని చెప్పినా వాటిని అమలు చేసిన దాఖలాలు లేవు. -జనార్దన్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు, చిత్తూరు

వేతన జీవులకు మొండిచేయి



సెక్షన్ 80 ఈ సేవింగ్స్ పరిమితి గత 15 సంవత్సరాలుగా రూ.1.5 లక్షలకు మించి పెరగలేదు. ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న గృహ రుణాలపై రూ.5 లక్షల వరకు పన్ను మినహాయింపు అమలు చేయాలి. గతంలో చాలాసార్లు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు.కానీ బడ్జెట్ రూప కల్పనలో ఉద్యోగులకు పన్ను భారం తగ్గింపు నిరాశగానే మిగిలిపోతోంది.

– మదన్‌మోహన్‌రెడ్డి, చిత్తూరు జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు

పన్ను చెల్లింపుదారులకు ఊరట



ఆదాయ పన్ను చెల్లింపు దారులకు కాస్త ఊరట ప్రకటించారు. ఈసారి ట్యాక్స్ సహా ఆరు సంస్కరణలు చేపట్టబోతున్నట్లు కేంద్రం తెలిపింది. ఉద్యోగస్తులకు కాస్త ఊరట లభిస్తుంది. మార్పులతో కూడిన ఐటీ బిల్లును వచ్చే వారం లోకసభలో ప్రవేశపెడతామని మంత్రి తెలిపారు. కొత్త స్లాబ్ రేట్లు ఏప్రిల్ నుంచి అమలు కానున్నాయి.

– వి.రెడ్డి శేఖర్ రెడ్డి, రాష్ట్ర ట్రెజరర్, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్

పండుటాకుల పింఛన్ పాట్లు

- పింఛన్ పంపిణీకి పడిగాపులు
- మొరాయించిన సర్వర్లు
- జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు
- ఒకే చోట చేరి పింఛన్ల పంపిణీ
- ప్రభుత్వ తీరుపై వృద్ధులు, పింఛన్ లబ్ధిదారుల ఆగ్రహం

చిత్తూరు కలెక్టరేట్ : టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పింఛన్ల పంపిణీ ఆర్భాటం తప్పితే లబ్ధిదారులకు మేలు చేసిందేమీ లేదు. ఏడు నెలలుగా ప్రతి నెలా పింఛన్ల పంపిణీలో జిల్లాలోని లబ్ధిదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసిన పింఛన్ల పంపిణీలో సర్వర్ మొరాయించింది. దీంతో వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు పడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ఇలాంటి సమస్యలెప్పుడూ తలెత్తలేదని పింఛన్‌దారులు పెదవి విరుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గంగాధరనెల్లూరు, చిత్తూరు, పుంగనూరు, కుప్పం, పలమనేరు, నగరి, పూతలపట్టు నియోజకవర్గాల్లో పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా సాగించారు. ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేయాల్సిన పింఛన్ నగదును ఒకేచోట అందరినీ చేర్చి ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 2,65,698 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉంది. అయితే శనివారం సాయంత్రం వరకు 2,55,818 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన 9,880 మందికి పింఛన్లు అందించలేక పోయారు.

క్లుప్తంగా

సరస్వతీ యాగానికి ఏర్పాట్లు

కాణిపాకం : ఈనెల 3వ తేదీన వసంత పంచమిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో మహా సరస్వతీ యాగంను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆస్థాన మండపంలో జరుగుతున్న ఈ ఏర్పాట్లను శనివారం ఈఓ పెంచల కిషోర్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు జరగాలని ఆదేశించారు. రద్దీ దృష్ట్యా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులకు ముందస్తుగా సూచనలు చేశారు.

కార్వేటినగరంలో కొండచిలువ కలకలం

కార్వేటినగరం : మండల కేంద్ర కార్యాలయానికి కూత వేటు దూరంలోని వడ్డెపాళెంకు సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి భారీ కొండచిలువ రావడంతో గుర్తించి మహిళలు కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని కొండచిలువను చంపారు. వారం రోజులుగా కోళ్లు కనిపించక మాయమవుతుండటం.. చివరకు కొండ చిలువ ప్రత్యక్షం కావడంతో దాని పనేనని పలువురు కొండ చిలువను హతమార్చడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

ఓంశక్తి గ్రామోత్సవంలో అపశ్రుతి



భక్తులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

బంగారుపాళెం : మండలంలోని జంబువారిపల్లెలో శుక్రవారం రాత్రి ఓం శక్తి భక్తులు విద్యుదాఘాతానికి గురయ్యారు. గ్రామంలో శుక్రవారం రాత్రి భక్తులు ఓంశక్తి అమ్మవారి గ్రామోత్సవాన్ని చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను పల్లకి తాకడంతో పల్లకి మోస్తున్న భక్తులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వారిలో ముగ్గురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మరి కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వారిని బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరో భక్తుడిని మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీ మోహన్ శనివారం గ్రామంలో పర్యటించి భక్తులను పరామర్శించారు.

అబార్షన్లకు అడ్డా ఆర్‌ఎంపీలు

▶ ఇటీవల చిత్తూరు నగరం చెన్నమ్మగుడిపల్లికి చెందిన ఓ పురిటి బిడ్డ అనారోగ్యానికి గురైంది. తల్లడిల్లిన తల్లిదండ్రులు వెంటనే ఆ బిడ్డను రాత్రి పూట ఓ ఆర్‌ఎంపీ దగ్గరకు తీసుకెళ్లారు. వెంటనే బిడ్డకు ఓ ఇంజక్షన్ ఇచ్చాడు. ఇంటికి తిరిగొచ్చేసరికి బిడ్డ కన్ను మూసింది. చేసేదీ లేక కన్నీళ్లతో కడుపుకోతను సరిపెట్టుకున్నారు.

▶ చిత్తూరుకు చెందిన 17 ఏళ్ల బాలిక కర్ణాటక రాష్ట్రంలో తల్లిదండ్రులతో కలిసి జీవిస్తోంది. 5 ఏళ్లకు కిందట పెళ్లి కాకుండానే గర్భిణి అయింది. ఇది తెలియక జీవించిన ఆ బాలికకు కడుపు పెరిగే కొద్ది అనుమానం వచ్చింది. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో వైద్యుల దగ్గరకు తీసుకెళితే కడుపుతో ఉన్నట్లు నిర్ధారించారు. అప్పటికే 6 నెలల అని ఆ డాక్టర్ లెక్కలు వేసి చెప్పారు. చేసేదీ లేక తల్లిదండ్రులు ఆ బాలికను ఇంట్లోనే దాచిపెట్టారు. ప్రసవ సమయానికి చిత్తూరు నగరం పొన్నియమ్మ గుడి వీధిలో ఓ ఆర్‌ఎంపీ వద్ద పని చేసిన మహిళ ఇంటి వద్దకు తీసుకెళ్లారు. ఆమె ప్రసవం చూసి వారి నుంచి రూ. 20 వేల వరకు ఫీజు తీసుకుంది. ఇలాంటి కేసులు జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయి.

▶ నగరికి చెందిన నరేష్ (35) కడుపు నొప్పి అని స్థానికంగా ఉన్న ఓ ఆర్‌ఎంపీ దగ్గరకు వెళ్లాడు. అతను ఇచ్చిన మాత్రలు మింగి నొప్పి ఇంకాస్త ఉధృతమైంది. ఇంజెక్షన్ కూడా తీసుకున్నాడు. అయినా ఆ నొప్పి భరించలేకపోయేసరికి ఓ ప్రైవేటు ఆస్పత్రిలోని డాక్టర్‌ను కలిశాడు. అక్కడ అన్ని రకాల పరీక్షలు చేయగా పేగులు అతుక్కుపోయాయని గుర్తించారు. దీంతో అతన్ని అడ్మిట్ చేసి సరైన చికిత్స అందించడంతో మూడు రోజుల్లో కోలుకున్నాడు.



వీకోటలో ఆర్‌ఎంపీ క్లినిక్‌లో సెలైన్ పెట్టే ప్రదేశం

జిల్లాలో ఆర్‌ఎంపీల ధందా నడుస్తోంది. అర్హతతో పనిలేకుండా స్థాయికి మించి వైద్యం చేస్తున్నారు. గల్లీగల్లీకి వెలుస్తున్న ఈ ఆర్‌ఎంపీలు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. విచ్చలవిడిగా వైద్యం చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పరిధి దాటి వైద్యం చేస్తూ కొందరు పేదల ప్రాణాలు తీస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి క్లినిక్‌లను అబార్షన్లకు పుట్టినిల్లుగా మార్చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రసవాలు చేస్తూ..ధనార్జనే ధ్యేయంగా ధందాను అడ్డగోలుగా నడిపిస్తున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

- జిల్లాల్లో కొందరు ఆర్‌ఎంపీల ఇష్టారాజ్యం
- అర్హతతో పనిలేకుండా స్థాయికి మించి వైద్యం
- బలైపోతున్న అమాయక ప్రజల ప్రాణాలు
- చోద్యం చూస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులకంటే ఆర్‌ఎంపీల సంఖ్య గణనీయంగా వ్యాప్తి చెందుతోంది. ప్రస్తుతం ఈ సంఖ్య 2500 దాటింది. ప్రైవేటు ఆస్పత్రుల సంఖ్య చూస్తే 1500 వరకు ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ ఆర్‌ఎంపీలు సందుకో క్లినిక్ ఏర్పాటు చేసుకుని కొందరు నకిలీ వైద్యానికి పురుడు పోస్తున్నారు. దీనికి తోడు పల్లెల మీదుగా తిరుగుతూ పల్లె ప్రజల ఆయువు తీస్తున్నారు. వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని వారి చేసే వైద్య ప్రచారాన్ని వ్యాప్తి చేయిస్తున్నారు. యూట్యూబ్ పాఠంతో ప్రజలను బలి చేస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

నకిలీ వైద్యులు ఇలా...

జిల్లాలో నకిలీ వైద్యుల ధందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఒక ఆర్‌ఎంపీ పిల్లలు పుడతారంటూ మందులు ఇస్తే..ఇంకొకరు ఏకంగా ఐయూఐ సైతం చేయిస్తున్నారు. అంతే కాదు మొలలకు చికిత్సలు, జ్వరాలకు మందులు, గ్లూకోజ్‌లు, ఇంజెక్షన్లు ఇస్తూ సమస్తం పూర్తి స్థాయి వైద్యుల్లా అవతారమెత్తారు. ఇబ్బడిముబ్బడిగా నోటికొచ్చిన మందులు, యాంటి బయోటిక్స్ రాసి పారేస్తున్నారు. అవి వాడిన రోగులకు కొత్త రోగాలు, రావడం, కిడ్నీలు దెబ్బతినడమే కాకుండా ఒక్కోసారి ప్రాణాలు పోతుంటాయి. మరికొందరు ఆర్‌ఎంపీలు మంత్రాలు..తంత్రాలంటూ ప్రజలను మాయ చేస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు..

ఇటీవల కాలంలో టీనేజీ గర్భిణుల సంఖ్య అధికంగా నమోదవుతోంది. ప్రధానంగా కర్ణాటకలో ఈ సంఖ్య పెరుగుతున్నట్లు అక్కడి వైద్యులు గుర్తించారు. అలాగే తమిళనాడులో ఈ రకమైన గర్భిణుల సంఖ్య అధికంగా ఉన్నట్లు సమాచారం. వీరిలో చాలా మంది అబార్షన్ల కోసం జిల్లాను ఆశ్రయిస్తున్నారు. ఈ టీనేజీ గర్భిణులు కొంత మంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి అబార్షన్లు చేయించుకుంటున్నారు. అయితే చాలా మంది ఆర్‌ఎంపీల వద్దకే క్యూ కడుతున్నారు. రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు కాసులు తీసుకుని గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్లు చేయిస్తున్నారు. జిల్లాలోని కొంత మంది టీనేజీలు కూడా అబార్షన్లకు ఆర్‌ఎంపీలనే ఆశ్రయిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో పలు ఆర్‌ఎంపీ క్లినిక్‌లు అబార్షన్లకు పుట్టినిల్లుగా మారిందని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక కుటుంబ సభ్యుల ఒత్తిడితో కూడా కొంత మంది ఆర్‌ఎంపీతో అబార్షన్లు చేయించుకుంటారని ప్రచారం జోరందుకుంటోంది.

కాసులు కురిపిస్తున్న ప్రసవాలు

అబార్షన్లతో పాటు పలువురు ఆర్‌ఎంపీలకు ప్రసవాలు అక్రమంగా ధనాన్ని ఆర్జించిపెడుతున్నాయి. ఇష్టానుసారంగా ప్రసవాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఇంటికి తెలియకుండా గర్భిణులైన వారిని టార్గెట్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో కొంత మంది ఆశా కార్యకర్తలు ఈ ధందా నడిపిస్తున్నారు. అంతా క్లినిక్‌లోనే చేస్తూ.. ఇందుకు గాను రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇక పురిటి బిడ్డలు వీరి చేతిలో ప్రాణాలు వదులుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న ఆపరేషన్లు చేస్తూ..అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. ఇంకొంత మంది ప్రైవేటు ఆస్పత్రులతో కుమ్మక్కై ప్రసవం, ఇతర ఆపరేషన్ కేసులను రెఫర్ చేస్తూ..కమిషన్లకు కక్కుర్తి పడుతున్నారని చెబుతున్నారు. ఇలా పలు రకాలుగా వీరి ధందాను నడిపిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని వైద్య నిపుణులు భగ్గుమంటున్నారు.

పట్టుకుంటే ఇబ్బంది..



ఆర్‌ఎంపీలపై తనిఖీలు చేస్తున్నాం. మేము పట్టుకుంటాం. కానీ ఏం చేయలేకపోతున్నాం. ఏం చేయాలి. వాళ్ల యూనియన్ అంటూరు. నాయకులను ఇన్వాల్వ్ చేస్తారు. ఏం చేయాలి. ఎక్కడైనా పట్టుకుంటే అక్కడ పనిచేసే డాక్టర్ మీద పడుతున్నారు. బెదిరిస్తున్నారు. త్వరలో మండల కమిటీలు వేస్తున్నాం. కట్టడి చేసేలా చూస్తాం.

– సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

కమీషన్ల కోసం రెఫర్లు



వీకోట : ఆర్‌ఎంపీల వైద్యం, మందులు అక్కడే ..

పలమనేరు : జిల్లాలోని పలు ప్రైవేటు నర్సింగ్‌హోంలకు సంబంధించిన ఏజెంట్లు భారీగా ఉన్నారు. వీరు నిత్యం జిల్లాలోని ఆర్‌ఎంపీల వద్దకెళ్లి రోగులను రెఫర్ చేయాలని కోరుతుంటారు. దీంతో రోగాన్ని బట్టి వీరికి ఆయా ఆస్పత్రుల నుంచి కమీషన్ దక్కుతోంది. ముఖ్యంగా పలమనేరులోని ఓ నలుగురు ఆర్‌ఎంపీలు ఇక్కడి గైనికాలజిస్టులతో భేరం పెట్టుకుని సిజేరియన్‌కు పంపితే రూ.5 వేలు కమీషన్ పొందుతున్నారు. అలాగే ఈ ప్రాంతంలో మెడికల్ షాపులు పెట్టేవారు ముందుగా ఓ ఆర్‌ఎంపీని పట్టుకొని అతడితో డీల్ చేసుకొని ఆషాపు పక్కనే క్లినిక్‌ను ప్రారంభిస్తున్నారు. మెడికల్ షాపు యజమానే క్లినిక్‌కు అద్దెలివ్వడంతో పాటు రోజూ రాసే మాత్రలను బట్టి రూ.500 దాకా కమీషన్లను ఆర్‌ఎంపీలకు ఇస్తున్నారు.

హామీల అమలులో కూటమి దగా

- మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆగ్రహం



మాట్లాడుతున్న పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు

పలమనేరు : ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చి ఇప్పుడు తమవద్ద డబ్బులేదంటూ కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలతో కలసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాలకు కుచ్చుటోపి పెట్టారన్నారు. సంపద సృష్టిస్తామంటూ చెప్పి వారానికోసారి అప్పులు తెస్తున్నారని దుయ్యబట్టారు. బటన్ ఎవరైనా నొక్కేస్తారని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు ఎందుకు బటన్ నొక్కడం లేదన్నారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి ఆస్తుల విషయాన్ని తెరపైకి తెచ్చారని, మదనపల్లి ఫైళ్ల దగ్ధంలో ఏమీ చేయలేక ఇప్పుడు మళ్లీ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా జనం రోడ్లమీద కొచ్చి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ నాయకులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, బాలాజీ నాయుడు, రంగన్న, మురళీకృష్ణ, మండీసుధా, చెంగారెడ్డి,ప్రహ్లాద, దయానందగౌడ, బాగారెడ్డి, చలపతి రెడ్డి,శంకర ప్ప, పట్టణ మైనారిటీనేతలు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓర్వలేక పెద్దిరెడ్డి కుటుంబంపై విమర్శలు

- భూముల ఆక్రమణపై జిల్లా యంత్రాంగం స్పందించాలి
- మాజీ ఎంపీ రెడ్డెప్ప డిమాండ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, చిత్రంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ఫకృద్దిన్‌షరీఫ్

పుంగనూరు : రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి భూముల కబ్జాలు , అక్రమాలకు పాల్పడాల్సిన అవసరం లేదని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప స్పష్టం చేశారు. శనివారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దిన్‌షరీఫ్‌తో కలసి మండల కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ.. ఎంతో ప్రజా సేవ చేస్తూ.. కోట్ల రూపాయల విరాళాలు ఇస్తూ ప్రజలను ఆదుకుంటున్న పెద్దిరెడ్డికి, ఎంపీ మిధున్‌రెడ్డికి భూములు కబ్జాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం కావాలనే పెద్దిరెడ్డి కుటుంబం ఎదుగుదలను చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తోందని, ఆ కుటుంబంపై తప్పుడు కథనాలు రాయిస్తోందని మండిపడ్డారు. కొనుగోలు చేసిన భూములు అటవీ భూములు అంటూ ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, అటవీ అధికారులు తక్షణమే స్పందించి, వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు. ఆరోపణలు చేసే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

రామకృష్ణ జడ్జి అనే పదానికే కళంకం

దళిత కులానికి చెంది, సస్పెండ్ అయిన జడ్జిగా ఉన్న రామకృష్ణ జడ్జి అనే పదానికే కళంకం తెస్తున్నారని మాజీ ఎంపీ రెడ్డెప్ప ఆరోపించారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తూ రామకృష్ణ ఇస్తున్న ఇంటర్వ్యూలను ఎలక్ట్రానిక్ మీడియా ప్రచురించవద్దని కోరారు. రామకృష్ణ కులాన్ని, జడ్జి అనే పదాన్ని అడ్డు పెట్టుకుని హీరో కావాలని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దళిత కులంలో దళితులు, జడ్జిలు ఎవరూ రామకృష్ణకు మద్దతు ఇవ్వడం లేదని తెలిపారు. కేవలం తప్పుడు మాటలతో సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా చేస్తున్న రామకృష్ణ ప్రసంగాలను ఖండిస్తున్నామని, ఇలాంటి ప్రసంగాలు చేస్తే తగిన గుణపాఠం నేర్పుతామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, రమణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మిషన్ వాత్సల్య పథకం పర్యవేక్షణ, శిశు విహార్‌లో పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి కోరారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. మిషన్ వాత్సల్య పథకం లో 2, శిశు విహార్‌లో 1 పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. chittoor,ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొందవచ్చన్నారు. అనంతరం పూర్తి చేసిన దరఖాస్తులను కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీలోపు అందజేయాలని పీడీ కోరారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అఖిల్



చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రా విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిత్తూరు నగరానికి చెందిన అఖిల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకప్రసాద్ నియామక ప్రకటన జారీ చేశారు. అనంతరం పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

కల్లూరు బడికి హరిత పురస్కారం

- 4న న్యూఢిల్లీలో అవార్డు అందజేత

పులిచెర్ల(కల్లూరు) : మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హరిత పురస్కారం వచ్చినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి పేర్కొన్నారు. నాలుగోసారి పాఠశాలకు వరుసగా జాతీయ స్థాయిలో హరిత అవార్డు రావడం పై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈనెల 4న ఇండియా హ్యాబిటేట్ న్యూఢిల్లీలో సెంటర్‌ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో డైరెక్టరు సునీత సరైన్ చేతుల మీదుగా అవార్డు అందజేస్తారన్నారు. పాఠశాల తరపున ఈ అవార్డు అందుకోవడానికి గ్రీన్ మాస్టరు వనపర్తి వెంకట సిద్దులుకు ఆహ్వానం అందినట్లు హెచ్ శ్రీవాణి తెలిపారు.